

వైతిరి తాలూకాలో విపత్తు నిరోధక టౌన్‌షిప్

బెంగళూరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): వయనాడ్‌లో భూమి కుంగిపోయిన ప్రాంతంలో బాధితులకు పునరావాసం కల్పించేందుకు కేరళ ప్రభుత్వం ముందుకు వచ్చింది. వైతిరి తాలూకాలో రెండు స్థలాలను ఎంపిక చేశామని అక్కడే విపత్తు నిరోధక టౌన్‌షిప్‌లు నిర్మించనున్నట్లు ఆ రాష్ట్ర సీఎం పినరాయ్ విజయన్ లేఖ రాశారు. ఈనెల 9న సీఎం సిద్దరామయ్య వయనాడ్ బాధితుల సమస్యపై లేఖ రాశారు. దీనిపై ఆయన స్పందించారు. రెండు టౌన్‌షిప్‌లను బాధితులకోసం నిర్మిస్తామని, కర్ణాటక సహా సాయం చేసిన వివరాలను రియల్‌టైం ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.



ప్రసంగిస్తున్న సిద్దు సవది

పట్టించుకోకపోతే ప్రత్యేకమే..!



● సభలో సంచలన వ్యాఖ్యలు

● ఉత్తర కర్ణాటకను నిర్లక్ష్యం చేస్తే ప్రత్యేక రాష్ట్రం కోరుతాం : బీజేపీ సీనియర్ నేత సిద్దు సవది హెచ్చరిక

బెంగళూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రజలు క్షమించరని ఇదే బేధాభిప్రాయం కొనసాగితే ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేయాల్సి ఉంటుందని బీజేపీ సీనియర్ నేత, తెరదాళ నియోజకవర్గ ఎమ్మెల్యే సిద్దు సవది హెచ్చరించారు. సువర్ణసౌధలో సోమవారం ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చలో భాగంగా మాట్లాడుతూ 1964లో ప్రారంభమైన కృష్ణ ఎగువ ప్రాజెక్టు 40ఏళ్లకు పూర్తయ్యిందని, ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంచే విషయం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి 2,700 ఎకరాలకు పరిహారం ఇచ్చారని, మిగిలిన భూమికి ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. బాధిత రైతులు ఎదురు చూస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ముంపు ప్రాంతంలో వ్యవసాయం చేసే పరిస్థితి లేకుండా పోయిందని, నీటి ఊట కారణంగా పంటలు పండవన్నారు. ఉత్తర కర్ణాటకను అన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశారన్నారు. కావేరి ప్రాజెక్టులకు ఇచ్చే ప్రాధాన్యం, పరిహారం సహా అన్ని విషయాల్లోనూ కృష్ణా నది ప్రాజెక్టులకు అన్యాయమే జరుగుతోం దన్నారు. రైతులు ఇటు పంటల పండక, పరిహారం అందక నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పరిహారానికి మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం ఉందన్నారు. బ్యాక్‌వాటర్ ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవనం నిత్యం సమస్యగా మారిందన్నారు. బాగల్కోట, విజయపుర రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆల్మట్టిద్వారా లబ్ధి పొందుతున్న రైతులు ముందుకు రావాలని, అప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యానికి తగిన గుణపాఠం చెప్పవచ్చునన్నారు. జలవనరుల ప్రాజెక్టులపై ఎమ్మెల్యేలు మాట్లాడతారని, మంత్రులు వినడం లేదని ప్రతిపక్షపార్టీ ఉప నేత అరవింద్ బెల్లద్ మండిపడ్డారు. ఈ ప్రాంతంలో రైతులకు అన్నింటా మోసం జరుగుతోందని చెరుకుకు సాంకేతికంగా గిట్టుబాటుధర లభించడం లేదన్నారు. తూకంలో, ధరలో అన్నదాతలు నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ విభాగం మంత్రి శివానందపాటిల్ మాట్లాడుతూ చెరుకు గతంలో టన్నుకు రూ.3,150 ధర ఉండేదని, ప్రసుత్తం, రూ.3,400కు పెరిగిందన్నారు. ఏ ఫ్యాక్టరీలో మోసం జరిగిందో చెబితే దాడులు జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. కృష్ణ ఎగువ ప్రాజెక్టుపై సభలోనే సమాధానం చెప్పాలని, గతంలో ఈ ప్రాజెక్టుకు రూ.40వేలకోట్లు ఇస్తామని చెప్పారన్నారు. ఉత్తర కర్ణాటక అంటేనే సవతితల్లి ప్రేమ చూపుతారన్నారు. కావేరి ప్రాజెక్టుల తరహాలోనే కృష్ణ ప్రాజెక్టులను పరిగణించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఎంటి కృష్ణప్ప మాట్లాడుతూ ప్రాజెక్టుల విషయంలోనే కాదని, ఇళ్ల మంజూరులోనే ఉత్తర కర్ణాటకకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు.



సమావేశంలో సీఎం, డీసీఎం

అంచెలంచెలుగా పూర్తి చేస్తాం

● కృష్ణ ఎగువ ప్రాజెక్టులపై సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణ ఎగువ ప్రాజెక్టు -3 ను అంచెలంచెలుగా పూర్తి చేస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. సోమవారం సువర్ణసౌధ ప్రాంగణంలో కృష్ణ ఎగువ ప్రాజెక్టుకు సంబంధించి కీలక సమావేశం జరిగింది. ఆల్మట్టి డ్యామ్ ప్రాంత జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆల్మట్టి జలాశయాన్ని 524.26 మీటర్లకు పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రాజెక్టుకు 1,33,867 ఎకరాల భూమి స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 28,967 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని 1.04 లక్షల ఎకరాలు పెండింగ్‌లో ఉందన్నారు. బ్యాక్‌వాటర్‌తో 188 గ్రామాలు ముంపు కానున్నాయని, వీటికి సంబంధించి 73,020 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లిస్తామన్నారు. భూసేకరణకు సంబంధించి 20వేల కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని, రైతులకు నచ్చచెప్పి ఉపసంహరించుకునేలా అధికారులు కృషి చేస్తే సమస్య పరిష్కారం సులభతరం అవుతుందన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఎమ్మెల్యేలు

మహారాష్ట్ర సీఎంతో రాష్ట్ర నేతల భేటీ

బెంగళూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను బెళగావి ప్రాంత బీజేపీ నేతలు భేటీ అయ్యారు. సోమవారం నాగ్‌పూర్‌లో బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళి, శ్రీమంతపాటిల్, ఎస్ఆర్ సంతోష్‌లు కలిశారు. మైసూరు తలపాగాతో సత్కరించి మైసూరు పాక్ అందచేశారు. ఇదే సందర్భంగా కర్ణాటక రాజకీయాలపై చర్చలు జరిపారు. వక్ఫ్‌కు సంబంధించి దావణగెరెలో భారీ సభ ఏర్పాటు చేస్తున్నామని తేదీ ఖరారయ్యాక ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రికి వివరించారు. కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర కార్యవైఖరిపైనా చర్చ జరిగినట్టు సమాచారం. అప్పాసాహెబ్ అవతాళె, భరత్ ముగదూర్, పారిశ్రామికవేత్త సుశాంత్‌పాటిల్ ఉన్నారు.



మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను సత్కరిస్తున్న రమేశ్ జార్కిహొళి



తవ్వేసిన దిబ్బ

బూడిద దిబ్బను దున్నేశారు..!

అది 500 సంవత్సరాల క్రితం ఏర్పడిన బూడిద దిబ్బ.. బళ్లారి రూరల్ పరిదిలోని మోకా హరాబ్లీ సిరివర గ్రామ పంచాయితీ పరిదిలో ఉంది. సాధారణంగా దీనిని ఎవ్వరూ చెదరగొట్టడానికి సాహసం చేయరు. అయితే ఆ పొలం రైతు ఆదివారం దానిని దున్నేశారు. 2012లో వీటిని ప్రభుత్వ రక్షణ స్థలాలుగా ప్రకటించారు. వీటి పక్కన దరిదాపు 100 వీటర్ల దూరం వరకూ ఎటువంటి పనులు చేపట్టరాదని ప్రభుత్వం ప్రకటించింది. దిబ్బను తవ్వడపై జిల్లా అధికారులు ఆరా తీశారు. ..8లో..

ముడుపుల ఆరోపణలపై విజయేంద్ర ఆగ్రహం

● సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని సీఎంకు సవాల్ ● సభలో అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం

బెంగళూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తుల నివేదికను బహిరంగం చేయరాదని అన్వర్ మానప్పాడికి రూ.150కోట్లు ముడుపులు ఇస్తాననే ఆరోపణలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శాసనసభ కలాపాలలో విజయేంద్ర సోమవారం ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. వక్ఫ్ ఆస్తుల అక్రమాలకు సంబంధించి మౌనంగా ఉండాలని 150 కోట్లు ఇవ్వచూపానని సీఎం సిద్దరామయ్య నేరుగా తనపై ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ప్రియాంక ఖర్గే తొలుత ఈ ఆరోపణలు చేయగా ఆ తర్వాత సీఎం, డీసీఎంలతోపాటు పలువురు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారన్నారు. తనకు ఎటువంటి సంబంధం లేదని అయినా తనపై ఆరోపణలు చేశారని, సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగానికి సంబంధించి అన్వర్ మానప్పాడి తొలుత నివేదిక ఇచ్చారని ఆ తర్వాత ఉపలోకాయుక్త న్యాయమూర్తి మరోనివేదిక ఇచ్చారన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న సీఎం సిద్దరామయ్య నివేదిక బహిరంగం కాకుండా మూసివేశారన్నారు. తాను ముఖ్యమంత్రికి సవాల్ చేస్తున్నా అన్నారు. అన్వర్ మానప్పాడి నివేదికను సీబీఐకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతి కుంభకోణంలో ఇరుక్కుపోయిన సీఎం తనను విమర్శిస్తున్నారని ఇలా హిట్ అండ్ రన్ చేయడం తగదని విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాగా డీసీఎం డీకే శివకుమార్ సువర్ణసౌధలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర మైనారిటీ కమిషన్ మాజీ చైర్మన్ అన్వర్ మానప్పాడి రాజకీయ ఒత్తిడితో యూటర్న్ తీసుకున్నారన్నారు. ఆయన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో చూశానని, ప్రధాని, హోం మంత్రిలకు లేఖ రాశానని అప్పట్లో చెప్పారన్నారు. సీబీఐ విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే ఆ తర్వాత పరిశీలిస్తామన్నారు.



మాట్లాడుతున్న విజయేంద్ర

నివేదిక మూసివేసే కుట్ర కాంగ్రెస్‌దే...

కాగా ఇదే విషయమై అన్వర్ మానప్పాడి మంగళూరులో మీడియాతో మాట్లాడుతూ 2013-14లో వక్ఫ్ ఆస్తుల అక్రమాలపై నివేదిక తయారు చేసేవేళ విజయేంద్రకు ఎటువంటి పదవులు లేవన్నారు. కేవలం యడియూరప్ప కుమారుడు మాత్రమేనన్నారు. 2019లో యడియూరప్ప సీఎంగా ఉన్నప్పుడు నివేదిక అమలు చేయాలని డిమాండ్ చేశానన్నారు. నివేదికను అమలు చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశానని ప్రధానికి లేఖ రాశానన్నారు. అయితే ఈ నివేదిక మూసివేయాలని విజయేంద్ర ఆఫర్ ఇవ్వలేదన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులే వేల కోట్ల రూపాయలు ఆఫర్ ఇచ్చారన్నారు. ఎందుకంటే వక్ఫ్ ఆస్తులు అక్రమాలకు పాల్పడింది. కాంగ్రెస్ పార్టీవారేనన్నారు. కాంగ్రెస్‌లో పెద్దమనుషులున్నారన్నారు. నేను నివేదికలో 27వేల ఎకరాలు ఆక్రమణ జరిగిందని గుర్తించానన్నారు. కానీ సీఎం సిద్దరామయ్య 1.60 లక్షల ఎకరాలకు నోటీసులు ఇచ్చారన్నారు. ఇదో బోగస్ అన్నారన్నారు. వక్ఫ్ ఆస్తులు కాజేసిన ప్రముఖులను విస్మరించి సామాన్య రైతులకు నోటీసులు ఇచ్చారన్నారు. సీబీఐ ద్వారా దర్యాప్తు చేయించాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు.

కలుషితం నుంచి కాపాడుకుందాం..!

● 30 నుంచి నిర్మల తుంగభద్ర అభియాన

● నది పరిశుభ్రతే ధ్యేయం

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా ప్రజల జీవనాడి తుంగభద్ర నది రోజు రోజుకూ కలుషితమవుతోంది. సాగు, తాగు నీరందించే నది పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నదిలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలతో నిండిపోతోంది. తాలూకాలోని మునిరాబాద్ నుంచి హులిగి మార్గం వరకు కాలుష్య అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తర కర్ణాటకలోని హులిగమ్మ దేవి, హులిగమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు నదిలో స్నానాలు ఆచరించి బట్టలు, ప్లాస్టిక్ ఆహార పదార్థాలను అక్కడే పారేస్తున్నారు. దీంతో నదిలో వ్యర్థాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రతి మంగళ, శుక్రవారం, పౌర్ణమి రోజుల్లో లక్షలాది మంది భక్తులు హులిగిని దర్శించుకుంటారు. భక్తుల స్నానాల కారణంగా కాలుష్యం పెరుగుతోంది. ఇక్కడ స్నానాలు చేయవద్దంటూ హులిగి ఆలయ నిర్వాహక బోర్డు ఇప్పటికే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. అయినా భక్తుల ధోరణిలో మార్పు రాలేదు. ఇక ఆనెగొంది చుట్టు ప్రక్కల అధికంగా వ్యర్థాలు నదిలో చేరుతున్నాయి. కంప్లి వంతెన వద్ద చెత్తాచెదారాలు అధికంగా చెత్త పారవేస్తున్నారు. నది సమీపంలోని ఫ్యాక్టరీలు, చుట్టుప్రక్కల పట్టణాలు, గ్రామాల నుంచి అధికంగా వ్యర్థాలు నదిలోకి వదులుతున్నారు. నది కాలుష్యంపై ప్రజల్లో గతంలో జాగృతి కార్యక్రమాలు నిర్వహించినా అవి ఎక్కడా అమలు కావడం లేదు... ప్రజలు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం శివమొగ్గలోని జాతీయ స్వాభిమాన ఆందోళన సమితి, పర్యావరణ ట్రస్ట్ సంయుక్తంగా శృంగేరిలో గంగడికల్లు నుండి గంగావతి తాలూకా కిష్కింద వరకు పాదయాత్ర జరిపి "నిర్మలా తుంగభద్రా అభియాన" ప్రారంభించింది. ఈ నెల 30న కొప్పళ జిల్లాలో అభియాన ప్రారంభం కానుంది. గంగావతిలో ఈ కార్యక్రమం ముగుస్తుంది. అభియాన కార్యక్రమంలో నది పరిశుభ్రత గురించి ప్రజల్లో జాగృతి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు. నదులను ప్రేమిద్దాం... నదులను కాపాడుకుందాం... నదిలో పువ్వులు, ఆకులు, దండలు వేయవద్దని, జీవనదులను కలుషితం చెయ్యరాదంటూ ప్రధాన నినాదాలతో అభియానను చేపట్టనున్నారు.



హులిగి వద్ద వ్యర్థాలతో నిండిన తుంగభద్ర నది



భక్తులపై వస్తున్న భూతప్ప

భక్తి పారవశ్యం..

● వైభవంగా భూతప్ప ఉత్సవాలు ● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

మడకశిర రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలోని భక్తరహళ్ళి గ్రామం భక్తితో పరవశించిపోయింది. భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేస్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా సోమవారం భూతప్పల ఉత్సవం వైభవంగా సాగింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, సంతానంలేనివారు వేకువజామునే స్నానం చేసి, తడిదుస్తులతోనే భూతప్పలు వచ్చే దారిలో పడుకున్నారు. భూతప్పల కాలిస్పర్శతో వ్యాధులు నయమవుతాయనీ, సంతానం ప్రాప్తిస్తుందని వారి విశ్వాసం. మధ్యాహ్న 12 నుంచి ఒంటి గంట వరకు భూతప్ప ఉత్సవాలు వైభంగా సాగాయి. మొదట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా నరసంహస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. పూజల అనంతరం భూతప్ప ఉత్సవాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలు ముందు వెళ్తుండగా దారికి అడ్డంగా పడుకున్న భక్తులపై భూతప్పలు వచ్చారు. అనంతరం నరసింహస్వామి ఆలయంలోకి వెళ్లి పూజలు నిర్వహించడంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు ఆలయంలో పూజలు చేసి, ఉపవాస దీక్షలు విరమించారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల మూడోరోజు జ్యోతుల ఉత్సవం ఘనంగా సాగింది. జ్యోతులను చేసి, వాటిని తలపై పెట్టుకుని, కాలినడకన ప్రదక్షిణ చేపట్టారు.



భూతప్పలు వచ్చేమార్గంలో పడుకున్న భక్తులు



గ్రామంలో ఊరేగుతున్న నరసింహస్వామి

న్యూస్‌బాక్స్

పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగుల సంఘానికి ఎన్నికలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బాలగంగాధర్ తెలిపారు. సహకార సంఘం ద్వారా ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక ప్రయోజన వెసులుబాటు వంటివి కలుగుతాయన్నారు. ప్రతి ఐదుసంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన డైరెక్టర్లకు సంఘం నిర్వహణ బాధ్యతలు అప్పచెబుతున్నట్లు పేర్కొన్నారు. జనవరి 12న ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారని తెలిపారు. ఆసక్తిగలవారు జనవరి 7నుంచి నామినేషన్లు దాఖలు చేయాలని కోరారు. 9న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందన్నారు. 12నిర్వహించే ఎన్నికల్లో సంఘ సభ్యులు పాల్గొని వారి ఓటును వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. వివరాలకు జిల్లా పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలోని ఉద్యోగుల పరపతి సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'గిరిజన టీచర్ల సమ్మెకు పరిష్కారం చూపాలి'

అనంతపురం విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉపాధ్యాయుల సమ్మెకు పరిష్కారం చూపాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ ప్రభుత్వాన్ని సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న గిరిజన టీచర్లు, అధ్యాపకులు 1659 మంది తమ డిమాండ్ల సాధనకు గత 31 రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. టీచర్లు, అధ్యాపకుల సమ్మె మూలంగా గిరిజన గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అవుట్ సోర్సింగ్ వారిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీ)లుగా పరిగణించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఆర్సీ 2022 మేరకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ-2024 నుంచి వీరు పనిచేస్తున్న పోస్టుల ఖాళీలను సైతం మినహాయించాలని కోరారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వీళ్లకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ లేఖ రాసినట్టు ఆయన స్పష్టం చేశారు.

రైల్వే ఉద్యోగులకు అవార్డులు

గుంతకల్లు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించిన ఐదుగురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయిస్ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం జోనల్ హెడ్ క్వార్టర్సులో జీఎం అరుణ్ కుమార్ జైన్ సోమవారం జోన్ వ్యాప్తంగా 13 మంది ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. రైల్వే భద్రత విషయంగా అప్రమత్తతతో వ్యవహరించినందుకు గుంతకల్లు డివిజన్‌లో ఐదుగురికి, సికింద్రాబాద్ డివిజన్‌లో నలుగురికి, విజయవాడ డివిజన్‌లో ఇద్దరికి, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లో ఒక్కొక్కరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు.

తాడిపత్రికి చేరిన డ్రోన్ కెమెరా

తాడిపత్రి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్ కెమెరా తాడిపత్రికి చేరింది. పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా సాయంతో సోమవారం రెండు డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణ సమీపంలోని అక్కన్నపల్లి, యల్లనూరు రోడ్డు, పుట్లూరురోడ్డు, ఆటోనగర్, శివాయం వద్ద, సాయిబాబా ఆలయం వద్ద, బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాను ఎగురవేశారు. వీటిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున వారిని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించిన డ్రోన్ కెమెరా

పొద్దు గూకిందా..?



పొద్దుతిరుగుడు పంట

కనుమరుగవుతున్న పొద్దు తిరుగుడు

భారీగా తగ్గిన పంట సాగు విస్తీర్ణం

బొమ్మనహాళ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్నేళ్ల కిందట ఎక్కడ చూసినా కనిపించిన పొద్దుతిరుగుడు పంట క్రమంగా కనుమరుగైంది. సాగు ఖర్చు తక్కువగా ఉండటం, దిగుబడి, లాభం అధికంగా ఉండటంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపేవారు. రాను రాను విత్తన నాణ్యత తగ్గడంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో కర్షకులు ఈ పంట సాగును వదిలేశారు. వేలాది ఎకరాల్లో సాగయ్యే పొద్దుతిరుగుడు పంట నేడు కనీసం వందల ఎకరాల్లో కూడా కనిపించడం లేదు.

వేల నుంచి పదుల ఎకరాల్లోకి సాగు

గతంలో ఖరీఫ్, రబీ సీజన్లో మండల వ్యాప్తంగా రెండు వేల ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను రైతులు సాగు చేసేవారు. మండలంలోని గోవిందవాడ, దర్గహొన్నూరు, బొల్లనగుడ్డం, బండూరు, కల్లుదేవానహళ్లి, హరేసముద్రం తదితర గ్రామాల్లో పొద్దుతిరుగుడు పంటను రైతులు ఎక్కువగా పండించేవారు. గత 15 ఏళ్ల నుంచి మండలంలో పొద్దుతిరుగుడు పంట సాగు రాను రాను తగ్గిపోయింది. ఈ సంవత్సరం మండలంలో కనీసం 20 ఎకరాల్లో కూడా పొద్దుతిరుగుడు పంట సాగు కాలేదు. రైతులు రబీలో వరికి బదులు పొద్దుతిరుగుడు పంట సాగు చేసేవారు.

దెబ్బతీసిన తెగుళ్లు

ప్రధానంగా పొద్దుతిరుగుడు పంట సాగును తెగుళ్ల దెబ్బ తీసినట్లు రైతులు చెబుతున్నారు. పంటకు వైరస్ సోకడంతో పూత రాలిపోతుంది. దీంతో ఆకులు విపరీతంగా ఎండిపోతూ మొక్క చనిపోతుంది. అదే తరుణంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర కూడా లభించలేదు. పొద్దు తిరుగుడు పంటను తక్కువ నీటి వనరులతో తక్కువ కాలపరిమితి గల పంటగా సాగుచేసే విధానంపై అధికారులు కూడా అవగాహన కల్పించకపోవడంత కూడా పంట సాగు తగ్గడానికి ప్రధాన కారణమని రైతులు అంటున్నారు. ప్రస్తుతం అనేక రకల పంటలకు దిగుబడి వచ్చేందుకు పలు రకాల రసాయనిక మందులు వచ్చాయి. పొద్దుతిరుగుడు పంట దిగుబడి కూడా బాగా రావడానికి మందులు ఉంటాయని, అధికారుల దృష్టి పెట్టి అవగాహన కల్పిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.


గిట్టుబాటు ధరలేదు



పొద్దు తిరుగుడు సాగుకు ఖర్చు తక్కువ. అయితే దిగుబడి పడిపోవడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో పొద్దు తిరుగుడు సాగు చేయడం లేదు. మా గ్రామ శివారులో ఎక్కువగా పొద్దు తిరుగుడు పంట సాగు చేసేవారు. ప్రస్తుతం వరిపంట సాగు ఎక్కువగా సాగుచేస్తున్నారు. పొద్దుతిరుగుడు సాగుకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసి ప్రభుత్వం ప్రోత్సహిస్తే రైతులు ముందుకొస్తారు.

- ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట

సాగును ప్రోత్సహించాలి



పొద్దుతిరుగుడు లాభదాయకంగా ఉండే పంట. అయితే సాగు చేసేందుకు రైతు ఆసక్తి చూపడంలేదు. విత్తనాలు నాణ్యత లేకపోవడం వల్లే పొద్దుతిరుగుడు పంట పండించడం లేదు. అధికారులు శ్రద్ధ చూపి నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వమే సబ్సిడీతో పంపిణీ చేసి సాగుకు ప్రోత్సహించాలి. పొద్దుతిరుగుడు పంట సాగు తక్కువ కావడంతోనే ఆయిల్ ధరలు పెరిగిపోతున్నాయి.

-అంజనేయులు, రైతు, దేవగిరి

విత్తనాలు రావడంలేదు



మార్కెట్లోకి నాణ్యమైన పొద్దుతిరుగుడు విత్తనాలు రావడం లేదు. మార్కెట్లో దొరికిన విత్తనాలను సాగుచేస్తే దిగుబడి రాదు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితిలో లేదు. వచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినా గిట్టుబాటు కావడం లేదు. మార్కెట్లో నాణ్యమైన విత్తనాలు వస్తే ఖరీఫ్ సీజన్ తర్వాత రబీలో సాగుకు మంచి అవకాశం ఉంటుంది.

- జనార్దనపల్లి రామాంజనేయులు, రైతు, ఉద్దేహాళ్

వైరస్‌తోనే సాగు తగ్గింది



పొద్దు తిరుగుడు పంటను గతంలో రైతులు ఎక్కువగా సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం రైతులు ఆ పంటను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. బట్‌నెక్రోసిస్ వైరస్‌తో పొద్దు తిరుగుడు పంట దిగుబడి తగ్గింది. ఈ వైరస్ ప్రభావంతో మొక్కలు చనిపోతాయి. అందుకే రైతులు పంటను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 50 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంట సాగు చేశారు.

- సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

పోలీసు స్టేషన్‌కు ప్రశ్నపత్రాలు

గణితం పేపర్ లీక్‌తో విద్యాశాఖ అప్రమత్తం

పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశాలు

స్టేషన్లలో భద్రపరచాలని డీఈఓల ఉత్తర్వులు



ఇటుకలపల్లి పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్న మన్నీల పాఠశాల ఉపాధ్యాయులు

అనంతపురం విద్య/యాడికి/ కొత్తచెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గణితం పేపరు లీక్ కావడంతో మంగళవారం నుంచి నిర్వహించాల్సిన సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6నుంచి 10వ తరగతులకు సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ఈనెల 11నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు తెలుగు, హిందీ, ఇంగ్లిషు పరీక్షలు నిర్వహించారు. సోమవారం గణితం పరీక్ష నిర్వహించాల్సి ఉంది. సోషల్‌మీడియా (యూట్యూబ్)లో గణితం పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడంతో సోమవారం నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేశారు. ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి సోమవారం సాయంత్రం ఆదేశాలు రావడంతో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంతా సమ్మెటివ్ అసెస్‌మెంట్ -1 ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్టేషన్లలో భద్రపరిచారు. ఉమ్మడి జిల్లాల డీఈఓలు కూడా ప్రధానోపాధ్యాయులందరూ ప్రశ్నపత్రాలను స్టేషన్లలో భద్రపర్చాలని సోమవారం ఆదేశాలిచ్చారు. అనంత డీసీఈబీ కార్యదర్శి గంధంనేని శ్రీనివాసులు ప్రశ్నపత్రాల భద్రతపై జిల్లా ఎస్పీని కలిసి లేఖ ఇచ్చారు. జిల్లాలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ 1.09 లక్షల మంది ఎస్ఏ-1 పరీక్షలు రాస్తున్నారు.

గణితం పేపర్ లీక్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం సమ్మెటివ్ అసెస్మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రైమరీ పరీక్షలు పూర్తయ్యాయి. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ పరీక్షలు జరుగుతున్నాయి. సోమవారం గణితం ప్రశ్నపత్రం లీక్ కావడంతో విద్యాశాఖ రాష్ట్ర అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆగమేఘాల మీద ఈ రోజు జరగాల్సిన గణితం పరీక్షను వాయిదా వేశారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని జిల్లాలోని డీఈఓలు, డీసీఈబీ కార్యదర్శులు అప్రమత్తం అయ్యారు. ప్రశ్నపత్రాలు ఉన్న కాంప్లెక్స్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు వెంటనే స్థానిక పోలీస్టేషన్లలో వాటిని భద్రపర్చాలని డీఈఓ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 10 వరకూ సుమారు 1.09 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 6వ తరగతిలో 23,500 మంది, 7వ తరగతిలో 22,200 మంది, 8వ తరగతిలో 22,700 మంది, 9వ తరగతిలో 21,300 మంది, 10వ తరగతిలో 20,100 మంది చదువుతున్నారు. గణితం, సైన్స్, సోషల్ పరీక్షలు జరగాల్సిన సమయంలో పేపర్ లీక్ కావడంతో గణితం పరీక్ష వాయిదా పడింది. ప్రస్తుతం సైన్స్, సోషల్ పరీక్షల ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్టేషన్లలో భద్రపరుస్తున్నారు.



బ్రహ్మసముద్రం జడ్పీ స్కూల్ ప్రశ్నపత్రాలున్న పెట్టెకు సీల్ వేసి పోలీస్టేషన్‌లో భద్రపర్చిన దృశ్యం

గతంలో ఇష్టారాజ్యం

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి రోజూ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యేవి. అయినా వాటిని పట్టించుకోకుండా అలాగే పరీక్షలు నిర్వహించి మమ అనిపించేవారు. గత మూడు, నాలుగేళ్ల ఇదే తంతు జరిగింది. ముఖ్యంగా ఎస్‌సీఈఆర్టీలోని ఓ ఉన్నతాధికారి వైఖరి వల్లే ఇదంతా జరిగిందంటూ అప్పట్లో ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. విద్యావ్యవస్థల ను ఆయన సర్వనాశనం చేశారంటూ పెదవి విరుస్తూ వచ్చారు. అయితే తాజాగా గణితం పేపర్ లీక్ అయిన విషయం తెలియగానే ఎస్‌సీఈఆర్టీ, కమిషనర్ వెంటనే అప్రమత్తం అయ్యారు. గణితం పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో డీఈఓ, డీసీఈబీ కార్యదర్శి ఆదేశాలతో కాంప్లెక్స్ స్కూళ్ల హెచ్ఎంలు పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తుండటంపై నగటు ఉపాధ్యాయుడు, సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాజీలేని పోరాటం వల్లే గెలుపు

మజ్దూర్ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్రావు

గుంతకల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కారంలో రాజీలేని పోరాటాల వల్లే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ జోన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్రావు పేర్కొన్నారు. రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ జోన్ స్థాయిలో మొదటి స్థానంలో గెలుపొందడంపై డివిజనల్ కేంద్రంలో సోమవారం ఉదయం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యాలయం నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో శంకర్రావు మాట్లాడుతూ సమస్యలపై చిత్తశుద్ధితో పోరా టాలు చేసి ఉద్యోగుల నమ్మకాన్ని నిలుపుకున్నందుకే ఎన్నికల్లో యూనియన్‌కు ప్రథమ స్థానం దక్కిందన్నారు. ఎనిమిదో వేతన సవరణ సంఘ నియామకం కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. జనవరి 2026కి 8వ పీఆర్సీ సిఫారసులు అమలయ్యేలా పోరాడటమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి ఉదయ భాస్కర రావు, గుంతకల్లు డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, ఏడీఎస్‌లు నారాయణ, మధుసూదన్, అశ్విని, జోనల్ కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు ఎం శ్రీనివాసులు, విశ్రాంత ఉద్యోగుల సంఘ డివిజనల్ నాయకుడు మస్తాన్ వలి, యూనియన్ బ్రాంచ్ కేఎస్ శేఖర్, బాబు, ఎస్ఎం బాషా, రాజశేఖర్, కే రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్ శంకర్రావు

సూపర్ ఆపరేషన్

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

కోతలేకుండా కణతి తొలగింపు



బాధితురాలితో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డాక్టర్లు

అనంతపురం టౌన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి న్యూరో సర్జన్లు భాస్కర్, రవితేజ, భాస్కరబాబు, అచ్యుత్ సోమవారం వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన సుజాతాబాయి తీవ్ర తలనొప్పి, చూపు తగ్గడంతో ఇబ్బంది పడేవారు. ఆమెను కుటుంబ సభ్యులు స్విమ్స్ న్యూరోసర్జన్ వద్దకు తీసికెళ్లి చూపించారు. అక్కడ పరీక్షలు చేసిన డాక్టర్లు సుజాతాబాయికి పిట్యూటరీ ట్యూమర్ ఉందని నిర్ధారించి ఆపరేషన్ చేయాలన్నారు. అక్కడ ఆరోగ్యశ్రీ వ ర్తించకపోవడంతో అంతడబ్బు వ్యయం చేసే స్తోమత లేక తిరిగి వచ్చేశారు. ఈక్రమంలోనే నవంబరు 21న సూపర్ స్పెషాలిటీ ఆ స్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ న్యూరో డాక్టర్లకు చూపించి, గతంలో జరిగిన విషయాలన్ని వివరించారు. దీంతో ఆస్పత్రి న్యూరో విభాగం డాక్టర్లు ఆ కేసును సవాలుగా తీసుకొని ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఆపరేషన్ చేస్తామని కుటుంబసభ్యులకు తెలిపారు. వారి అంగీకారంతో ఈనెల 10న ఆమెకు ఎలాంటి కోతలు లేకుం డా ఎండోస్కోప్, మైక్రోస్కోప్ ఉపయోగించి ఆపరేషన్ చేశారు. ఈఆపరేషన్ విజయవంతం కావడంతో సుజాతాబాయి ఆరోగ్యంగా కోలుకున్నారు. అరుదైన ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌వెంకటేశ్వరరావు, సూపర్‌స్పెషాలిటీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అభినందించారు. కార్యక్రమంలో అనస్తీషియా డాక్టరు శ్రీహరితోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నల్లతామరకు చెక్ పెట్టండి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మిరప పంటను కొత్తగా ఆశిస్తున్న నల్లతామర పురుగు నియంత్రణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జేసీ శివ్‌నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మలతో కలిసి కలెక్టర్ నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపే కరపత్రాలను సోమవారం ఆవిష్క రించారు. ఈ కరపత్రాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అందజేసి , నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

సామాజిక స్పృహతో రచనలు అభినందనీయం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం విద్య, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సామాజిక స్పృహతో కూడిన రచనలు చేయడం అభినందనీయమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ భవన్‌లోని చాంబర్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రచయిత జూటూరు తులసీదాసు రచించిన కాకులు దూరని కారడివి కథా సంపుటాన్ని కలెక్టర్, డీఈఓ ప్రసాద్‌బాబు, రచయిత తులసీదాస్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల మనస్సుకు హత్తుకునేలా సరళమైన పదాలతో కథలు రాయడం బాగుందన్నారు. బాల్యంలో పిల్లలకు నీతిని కథల రూపంలో బోధించడం మంచి ఆలోచనన్నారు. చదువుపై ఆసక్తిని పెంచేలా కథలు ప్రేరణ కలిగించేలా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి గంధంనేని శ్రీనివాసులు, ఎస్‌ఎస్‌టీపీ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద, సమగ్రశిక్ష ఉద్యోగి గోపాల్, ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

896 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇఫ్‌కో కంపెనీకి చెందిన 896 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 514 మెట్రిక్ టన్నులు డీఏపీ, 382 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం ఎరువులు ఉన్నాయని వెల్లడించారు.

జేఎన్‌టీయూ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొన్ని వారాల కిందట ఉద్యోగ విరమణ పొందిన జేఎన్‌టీయూ ఉద్యోగులకు మొత్తం ఆర్థిక ప్రయోజనాలు చెల్లించారు. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల(అడహక్)కు వేతన బకాయిలు చెల్లించారు. అందుకు కృతజ్ఞతగా సోమవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ల (అడ్‌హక్) అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్యను వేర్వేరుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని ఉద్యోగ, సిబ్బందికి నెల వేతనమే జీవనాధారమన్నారు. గతంలో వారిని విభజించి వైషమ్యాలు సృష్టించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో అలాంటివాటికి చోటులేకుండా ప్రతి ఉద్యోగికి దక్కాల్సిన అన్ని ప్రయోజనాలను చెల్లించేలా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.



వీసీ సుదర్శనరావును సన్మానిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

సమస్యలపై నేరుగా సంప్రదించండి

- డీఆర్ఎం విజయకుమార్

గుంతకల్లు, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): రైల్వే విశ్రాంత ఉద్యోగులకు ఏవైనా జటిల సమస్యలుంటే తనతో నేరుగా సంప్రదించవచ్చని డీఆర్ఎం విజయ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం ఉదయం రైల్వే పెన్షన్ అదాలత్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే రిటైర్డు ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారం కోసం పెన్షన్ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే తనను నేరుగా కలవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ క్యాపిల్ అరోరా, ఏఐఆర్ఎఫ్ డివిజన్ కార్యదర్శి సుంకప్ప, పీపీఆర్ డివిజనల్ అధ్యక్షుడు పీవీవీ ప్రసాద రావు, కార్యదర్శి రంగస్వామి, ఏఐఆర్ఎఫ్ డివిజనల్ ఉపాధ్యక్షుడు కళాధర్ పాల్గొన్నారు.



పెన్షన్ అదాలత్‌లో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయకుమార్



చిక్కేపల్లి వద్ద గుంతలు పడిన రోడ్డు



యాడికి సమీపాన అధ్వానంగా రోడ్డు

ఎటు వెళ్లినా గుంతలే..!

అధ్వానంగా యాడికి-బుగ్గ రోడ్డు

యాడికి-రాయలచెరువు రోడ్డు దుస్థితీ అంతే..

కిందపడి గాయపడుతున్న వాహనదారులు

యాడికి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఇటు వెళ్తే గుంత... అటు వెళ్లినా గుంతే. దీంతో ఎటు వైపు వెళ్లాలో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రం నుంచి బుగ్గకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పై అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు తప్పించుకునే క్రమంలో వాహనాలు కిందపడి తీవ్రంగా గాయపడుతున్నారు. ఇటీవల బండలను తరలిస్తున్న ట్రాక్టర్ రోడ్డుపై గుంతలను తప్పించబోయి బోల్తాపడింది. అలాగే ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి పడటంతో యాడికికి చెందిన ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అయినా రోడ్డు మరమ్మతులు గురించి పట్టించుకొనే వారు కరువయ్యారని వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. యాడికి నుంచి రాయలచెరువుకు వెళ్లే రోడ్డు కూడా గుంతలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకొనే వారే లేరని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకేమి పట్టదు అన్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారుల చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు చేపట్టి యాడికి-బుగ్గ, యాడికి- రాయలచెరువు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

బీథోవెన్ (జయంతి)



జర్మన్ దేశానికి చెందిన స్వరకర్త లుడ్విగ్ వాన్ బీథోవెన్ 1770 డిసెంబరు 17న జన్మించారు. చిత్రకారుడు, పియానిస్ట్‌గాను రాణించారు. పాశ్చాత్య సంగీతం లోనూ, క్లాజికల్‌లోనూ తనదైన ప్రత్యేకత చాటుకున్నారు. జీవిత చరమాంకంలో చెవిటితనంతో బాధపడినా 9వ సింఫోనీకి స్వరకల్పన చేశారు. 1827 మార్చి 26న కన్నుమూశారు. జర్మనీ దేశంలో స్వరకర్తకు తొలి శిలావిగ్రహం ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. సౌరవ్యవస్థలో బుధుడిపై మూడో అతిపెద్ద బిలంనకు ఆయన గౌరవార్థం బీథోవెన్ పేరు పెట్టారు.

రూమి (వర్ధంతి)



13వ శతాబ్దంలో ఇస్లామిక్ స్కాలర్‌గా పేరొందిన మౌలానా జలాలుద్దీన్ మొహమ్మద్ బాల్కి 1207 సెప్టెంబరు 30న ప్రస్తుత అఫ్ఘనిస్థాన్‌లోని బల్ఖ్‌లో జన్మించారు. న్యాయతత్వవాది, ధార్మికవేత్త, సూఫీ. బైజాంటియన్ ప్రాంతంలోని 'రూమ్'లో ఎక్కువకాలం గడపడంతో రూమిగా పేరొందారు. ఆయన రచనలు, ఆధ్యాత్మిక భావాలు ఎంతో ప్రభావితం చేశాయి. ఆయన రచించిన కవితలు ప్రపంచ వ్యాప్తంగా పలు భాషలలోకి అనువాదం అయ్యాయి. పర్షియాతోపాటు టర్కిష్, అరబిక్, గ్రీకు భాషలలో రచనలు చేశారు. తన మరణతేదీని ముందుగానే ప్రకటించినట్టుగా 1273 డిసెంబరు 17న కన్నుమూయడం గమనార్హం.

కాశీవిశ్వనాథ శివరామన్ (పుట్టినరోజు)



పద్మవిభూషణ్ గ్రహీత ఉమయల్పురం కాశీవిశ్వనాథ శివరామన్ 1935 డిసెంబరు 17న తంజావూరు ప్రాంతంలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో మృదంగ విద్వాన్, గేయ రచయిత కూడాను. మద్రాస్ యూనివర్శిటీ నుంచి బీఏ, బీఎల్ పట్టా పొందారు. పండిట్ రవిశంకర్, హరిప్రసాద్ చౌరాసియాతో కలసి పలు జుగల్బందీ కచేరీలు ప్రదర్శించారు. 'పద్మశ్రీ', పద్మభూషణ్ సహా కలైమామణి, సంగీత కళాశిఖామణి, సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు, కేరళ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు.

పోప్ ఫ్రాన్సిస్ (పుట్టినరోజు)



క్రైస్తవ ధర్మగురువుగా ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన పోప్ ఫ్రాన్సిస్ 1936 డిసెంబరు 17న అర్జెంటీనాలో జన్మించారు. వాటికన్ సిటీలోని క్యాథలిక్ చర్చ్‌కు 2013 నుంచి ప్రధాన నిర్వాహకులుగా కొనసాగుతున్నారు. దేవుడి ప్రేమ, పేదలను ఆదుకోవడం వంటివి ప్రబోధం చేశారు. అసలు పేరు జార్జ్ మరియో బెర్గోగ్లియో. క్రీస్తు బోధనలను విశ్వవ్యాప్తం చేశారు. పలు ఆధ్యాత్మిక రచనలు చేశారు.

జగదీశ్ శెట్టర్ (పుట్టినరోజు)



బెళగావి ఎంపీగా కొనసాగుతున్న జగదీశ్ శెట్టర్ 1955 డిసెంబరు 17న బాదామి తాలూకా కెరూరు గ్రామంలో జన్మించారు. బీజేపీలో సుదీర్ఘకాలం కొనసాగిన ఆయన ఇటీవల కాంగ్రెస్‌లో చేరినా అందులో ఇమడలేక బీజేపీకి వాపసు వచ్చారు. కర్ణాటక శాసనసభ స్పీకర్‌గా, 21వ ముఖ్యమంత్రిగాను వ్యవహారించారు. హుబ్బళ్ళి - ధార్వాడ సెంట్రల్ నియోజకవర్గంనుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. కళసా-బండూరి ప్రాజెక్టులోనూ, బెళగావి సువర్ణసౌధ నిర్మాణంలో, హుబ్బళ్ళిలో సౌత్‌వెస్ట్రన్ రైల్వే ఏర్పాటులో క్రియాశీలకంగా వ్యవహరించారు.

జయసుధ (పుట్టినరోజు)



'సహజనటి'గా పేరొందిన జయసుధ 1958 డిసెంబరు 17న చెన్నైలో జన్మించారు. అసలు పేరు సుజాత. తెలుగు, మళయాళ, హిందీ, కన్నడ భాషలలో 325కు పైగా సినిమాలలో నటించారు. ఏడాదిలో 24 సినిమాలు విడుదలైన రికార్డు ఉంది. కే బాలచందర్ దర్శకత్వం వహించిన పండంటి కాపురం సినిమాలో 12వ యేట బాలనటిగా అరంగేట్రం చేశారు. ఉత్తమనటిగా 7 ఫిల్మ్‌ఫేర్, 8 నంది అవార్డులు, ఏఎన్నార్ నేషనల్ అవార్డు ఇతర పురస్కారాలు పొందారు. రాజకీయాల్లో ప్రవేశించి సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు.



త్రిలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

ధర్మవరంరూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక త్రిలిం గేశ్వర ఆలయంలో సోమవారం స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాఘవశర్మస్వామి శివ పార్వతులను ప్రత్యేకంగా అలంక రించారు. ఆలయంలో మహా న్యాస పూర్వక ఏకాదశి రుద్రాభి షేకం, భస్మాభిషేకం, పార్థివలింగ పూజ, గణపతిహోమం, రుద్రహోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు.

వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

▸▸ రాజరాజేశ్వరి డెంటల్ కళాశాల స్నాతకోత్సవంలో వీసీ పిలుపు

బెంగళూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్లు అంకితభావంతో పనిచేయాలని సమాజంలో ఏ వృత్తికి లేనటువంటి గౌరవం వైద్యులకు మాత్రమే సాధ్యమని రాజీవ్ గాంధీ మెడికల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎంకే రమేశ అభిప్రాయపడ్డారు. రాజరాజేశ్వరి విద్యాసంస్థలకు అనుబంధమైన మెడికల్ కళాశాల 28వ స్నాతకోత్సవం సోమవారం కళాశాల ప్రాంగణంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవస్థాపకులు డాక్టర్ ఏసీ షణ్ముగం భాగస్వామ్యులయ్యారు. ఎంకే రమేశ మాట్లాడుతూ రాజరాజేశ్వరి విద్యాసంస్థలను ఒక లక్ష్యంతో ప్రారంభించి దశాబ్దాలకాలంగా గుణాత్మకతకు వ్యవస్థాపకులు ఏసీ షణ్ముగం వ్యవహరించారని కొనియాడారు. డాక్టర్లు వృత్తి ధర్మాన్ని పాటిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఎడ్విన్ దేవదాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయానంద, సీఈఓ సీఎన్ సీతారాం, ప్రిన్సిపాల్ డాక్టర్ గిరీశ్ తదితరులు పాల్గొన్నారు. ఎలీసియా పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ప్రముఖ నటి బృంద ఆచార్య, గాయని డాక్టర్ శమిత మల్నాడ్, నటుడు సూర్యగౌడలను వేదికపై సత్కరించారు.



స్నాతకోత్సవంలో డాక్టర్ ఏసీ షణ్ముగం, రాజీవ్‌గాంధీ మెడికల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎంకే రమేష్

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



దుకాణదారులను హెచ్చరిస్తున్న నగరసభ కమిషనర్ చలపతి

▸▸ మూడు రోజులు గడువు విధించిన నగరసభ

చింతామణి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రోడ్లకు అనుబంధమైన ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొన్న తరుణంలో నగరసభ అధికారులు సోమవారం ప్రత్యేక కార్యాచరణ నిర్వహించారు. కొవిడ్ సమయంలో విధించిన ఆంక్షలను గుర్తు చేసేలా దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. చాలాచోట్ల ఫుట్‌పాత్‌లను దుకాణదారులు ఆక్రమించడమే సమస్యగా గుర్తించి మూడు రోజుల్లోగా స్వచ్ఛందంగా తొలగించాలని గడువు విధించారు. పాటించని పక్షంలో నగరసభ విధించే జరిమానా, ఇతర చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నగరసభ సర్కిల్‌నుంచి కన్నంపల్లి సర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్‌లను తొలగించాలని దుకాణదారులకు నగరసభ కమిషనర్ చలపతి హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యా చరణలో నగరసభ అధికారులు ఆరతి, విజయకుమార్, సీకే బాబు, శివకుమార్ సహా నగరసభ సిబ్బంది, టౌన్ ఎస్సై ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సహజయోగాతో మార్పు సాధ్యం

బెంగళూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సహజ యోగాతో మార్పును సొంతంగా అనుభూతి పొంద వచ్చునని సహ్, అజ్ అనె రెండు పదాలతో ఏర్పడిం దని నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజీవ్ కుమార్ అభిప్రాయపడ్డారు. స్కౌట్స్ సభాంగణంలో ధ్యానం పై నమ్మకం, ఆసక్తి లేనివారికి సైతం సహజయోగా-మహాయోగా పేరిట చైతన్య కార్యక్రమం నిర్వహించారు. యోగా ద్వారా ఏవిధంగా ఆరోగ్యం మెరుగవు తుందనేది వివరించారు. లైవ్ ఎర్బినల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ మనోజ్‌కుమార్, సంగీత దర్శకురాలు మానసహొళ్ళ, నటి రాధికా నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



యోగాపై చైతన్య కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్‌కుమార్ తదితరులు

వీల్‌చెయిర్ క్రికెట్‌లో చెన్నై లెజెండ్స్ విజయం

బెంగళూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎబిలిటీ స్పోర్ట్స్ లీగ్ మూడో విడత పోటీలో చెన్నై లెజెండ్స్ జట్టు విజయం సాధించింది. బెంగళూరులో జరిగిన వీల్‌చెయిర్ పోటీలలో ఫైనల్స్‌లో బెంగళూరు ఈగల్స్ జట్టుపై 53 పరుగుల ఆధిక్యంతో చెన్నై లెజెండ్స్ గెలుపు సాధించారు. సైకిల్‌ప్యూర్ అగర్బత్తీ సంస్థ సీఈఓ అర్జున్‌రంగా, ఆల్‌రౌండర్ కృష్ణప్ప గౌతమ్, ఉపసంపాదకులు ముకుందొశెట్టితోపాటు పలువురు పాల్గొన్నారు.



ట్రోఫీలతో విజేత జట్టు

మాకంటే పానిపూరి అమ్మేవారు నయం

▸▸ తహసీల్దారు కృష్ణమూర్తి ఆవేదన

బెంగళూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగమే వద్దనేలాంటి ఒత్తిడి వస్తోందని మాకంటే చిన్నకొట్లు నడిపేవారు సుఖంగా ఉన్నారని హాసన్ జిల్లా హొళె నరసీపుర తహసీల్దారు కేకే కృష్ణమూర్తి విచారం వ్యక్తం చేశారు. ఆదివారం తాలూకా ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దారు ముఖ్యులుగా పాల్గొన్నారు. తానొక తహసీల్దారు అని ఒక తాలూకా పాలనా వ్యవహారాలలో ముఖ్యమైన వ్యక్తినని, ఒక్కోసారి ఈ ఉద్యోగం వద్దనిపిస్తుందన్నారు. భార్య, పిల్లలతో రోజూ కొంత సమయం గడపలేకపోతున్నామని, వారితో విహారయాత్రలు మరిచిపోయానని, కనీసం సమీపంలోని ఆలయాలకు వెళ్లేందుకు కావడం లేదన్నారు. మాకు ఒత్తిడి పెరిగిపోతోందన్నారు. శాసనసభ్యులు చట్టాలు చేస్తున్నారని వాటిని కార్యరూపంలోకి తేవడం మాపని అన్నారు. అన్ని శాఖల సౌలభ్యాలు ఎక్కడి వరకు చేరాయనేది ముఖ్యమన్నారు. ఇటీవల మొబైల్ అందుబాటులోకి వచ్చిందని, మా పనితీరు పరి శీలిస్తారని, అంతలోనే షోకాజ్ నోటీసు జారీ చేస్తార న్నారు. శాఖలవారీగా విచారణలు జరిపేందుకు ప్రత్యేకమైన వాట్సప్ గ్రూప్‌లు పెట్టారన్నారు. ఉదయం రిపోర్టు అడిగితే సాయంత్రా నికల్లా ఇచ్చేయా లనేలాంటి చిత్రహింస భరించలేకపోతున్నామన్నారు. టార్గెట్ ఇచ్చినప్పుడు గడువు ఉండాలని, అలా కాకుండా ఉదయం ఇస్తే మధ్యాహ్నం లేదా మరుసటి రోజు ఉదయానికే నివేదికలు కావాలంటే ఎలా సాధ్య మన్నారు. గ్రామకార్యదర్శులను ఎంతగా వేధిస్తున్నా మంటే, వారినుంచే నివేదికలు రావాల్సి ఉన్నందున మరో మార్గం లేకుండాపోతోందన్నారు. ఒకప్పుడు టీచర్ పోస్టు అంటే సులభతరంగా ఉండేదని, ఇప్పుడు ఆ ఉద్యోగం కూడా ఒత్తిడి అవుతోందన్నారు. నా భార్య, మరదలు, తోడల్లుడు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నా రన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు ఇచ్చే కోడిగుడ్డు 5 రూపాయల చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంటుందని, మార్కెట్‌లో 1-2 రూపాయలు ఎక్కువైతే అది ఉపాధ్యాయులు భరించాల్సి వస్తోందన్నారు. గుడ్డు సైజు పరిశీలించుకోవాల్సి వస్తోందని, వీటికి తోడు చిక్కీ ఒకటి చేరిందన్నారు. ఇలా ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు కృష్ణమూర్తి

తిరుమలకు పాదయాత్రగా భక్తులు

శిడ్లఘట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా గౌరిబిదనూరు పరిధిలోని తొండేబావి నుంచి తిరుమలకు కాలినడకన బయల్దేరిన బృందం శిడ్లఘట్ట - చింతామణి మార్గంలోని హుణసేనహళ్ళికి చేరుకుంది. ఈ బృందంలోని శ్రీధరాచారి మాట్లాడుతూ 24 సంవత్సరాలుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్లడం ఆన వాయితీగా ఉందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించడమే లక్ష్యమన్నారు. పాదయాత్రలో మంచేనహళ్ళి, తొండేబావి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 150మంది భక్తులు ఈనెల 22న తిరుమలకు చేరుకుని వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటామన్నారు. దారిపొడవునా శ్రీవారి నామాలను స్మరించుకుంటూ వెళ్తామన్నారు. బృందంలో మార్కెట్ మోహన్, విజయశేఖరరెడ్డి, కృష్ణమూర్తి, సుధాకరరెడ్డి, మురళి, నరసింహమూర్తి, లక్ష్మీపతి, సంతోష్, ఆదినారాయణప్ప, సతీశ్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



శిడ్లఘట్ట తాలూకాలో భక్తుల బృందం

ప్రభుత్వ సౌకర్యాలు సద్వినియోగం చేసుకోండి

విజయపుర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రంగంలో పేదలకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సౌలభ్యాలు సద్విని యోగం చేసుకోవాలని మింటో ఆసుపత్రి నేత్ర వైద్యురాలు డాక్టర్ సవితా అభిప్రాయ పడ్డారు. పట్టణంలోని సముదాయ ఆరోగ్య కేంద్రంలో మింటో కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షా శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి నెలా రెండో సోమవారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహిస్తోందని, కంటిపొర చికిత్సలు ప్రతినెలా నిర్వహించే శిబిరంలో అర్హులైనవారిని ఎంపిక చేసి బెంగళూరు మింటో ఆసుపత్రికి తరలించి ఉచిత చికిత్సలు అందిం చనున్నట్టు తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు మూడు నెలలకోసారి లేజర్ శస్త్ర చికిత్సను నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుత శిబిరంలో 15మంది పరీక్షలు చేయించుకోగా ఆరుగురికి కంటిపొర చికిత్సలు అవసరమని నిర్ధారించగా మరో ఇద్దరికి లేజర్ శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. శిబిరంలో డాక్టర్ వైశాలి, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు

నేరాల నియంత్రణపై అవగాహన



జాగృతిలో ఎస్సై లక్ష్మినారాయణ తదితరులు

బంగారపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 2024 వార్షిక నేరాల నియంత్రణ మాసోత్సవంలో భాగంగా బంగారపేట తాలూకాలోని కామసముద్రంలో ఎస్సై లక్ష్మినారాయణ నేతృత్వంలో జాగృతి నిర్వహించారు. కామసముద్ర బస్టాండ్‌లోని ఆటో డ్రైవర్‌లకు, ప్రజలకు నేరాల నియంత్రణ గురించి అవగాహన కల్పించారు. ఇళ్ల చోరీలు, చైన్‌స్నాచింగ్‌ల గురించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలు కారాదని హెచ్చరించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కరపత్రాలు పంపిణీ చేశారు.

మినీగోకులాలను త్వరగా నిర్మించుకోండి

ధర్మవరంరూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ నిధులతో పాడిరైతులకు మినీగోకులాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, వాటి నిర్మాణాలను రైతులు త్వరతగతిన పూర్తి చేసుకోవాలని ఉపాధిహామీ ఏపీడీ వెంకటచలపతి సూచించారు. సోమవారం మండలంలోని చిగిచెర్లలో పాడిరైతు నారాయణస్వామికి చెందిన నిర్మాణ దశలో ఉన్న మినీగోకులాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. సకాలంలో వాటిని నిర్మించుకుంటే రైతులకు భారం కాకుండా బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తామన్నారు. అదేవిధంగా గ్రామంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద మంజూరైన మామిడి మొక్కలను ఆయన పరిశీలించారు. కూలీలు చేస్తున్న ఫారంపాండ్ పనులను పరిశీలించి కొలతలకు అనుగుణంగా పనిచేస్తే పూర్తిగా కూలి లభిస్తుందన్నారు. ఆయన వెంట ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శంకర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, ఫీల్డ్‌అసిస్టెంట్ హేమంత్ ఉన్నారు.

పేదలకు ఇంటి పట్టాలివ్వండి

● ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

ధర్మవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి గ్రామ సమీపంలో ప్రభుత్వ భూమిని.. పేదలకు ఇళ్లపట్టాలుగా మంజూరు చేయాలని సత్యసాయి జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ కతిజన్‌ఖుబ్రాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ సమీపంలోని సర్వేనెంబరు 281-ఏలో దాదాపు మూడు ఎకరాలు ప్రభుత్వ భూమి చెరువు కింద ఉందని, దాన్ని లింగమశెట్టికుంటగా పిలుస్తారని తెలిపారు. కొందరు కబ్జాదారులు ఆ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఏకంగా ప్లాట్లు వేసి అమ్మకాలు చేపట్టారన్నారు. కావున ఆ భూమిని కాపాడి పేదలకు ఇళ్లపట్టాలుగా ఇవ్వాలని ఆయన కోరారు.

ఆరోగ్యంపై అవగాహనకు గ్రీన్‌రైడ్

బెంగళూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆరోగ్యంపై కార్పొరేట్‌రంగంలో జాగృతి కల్పిస్తున్న పాజ్కేర్ సంస్థ గ్రీన్‌రైడ్ ఇన్షియేటివ్ 4.0కు శ్రీకారం చుట్టింది. ఫిట్‌నెస్ ఐకాన్ మిలింద్ సోమన్ నేతృత్వంలో ఈనెల 17నుంచి 20వరకు కొనసాగనుంది. బెంగళూరులో ప్రారంభమయ్యే గ్రీన్‌రైడ్ బెళగావిలో ముగియనుందని నిర్వాహకులు తెలిపారు. ఇదే సందర్భంగా ఫ్లెక్స్ పేరిట ఇన్సూరెన్స్‌ను లాంఛనంగా ప్రారంభించినట్టు పాజ్కేర్ సంస్థ సీఈఓ సంచిత్ మాలిక్ తెలిపారు. ఉద్యోగులలో ఆరోగ్యంపై అవగాహన, జాగృతి కల్పించడమే లక్ష్యమన్నారు.



ఫిట్‌నెస్ ఐకాన్ మిలింద్ సోమన్ తదితరులు

మటమారి ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు

▸▸ బాలింత మృతిపై జిల్లాధికారి నితీశ్ ఆరా



తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి నితీశ్

రాయచూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలింత మృత్యువాతపడిన నేపథ్యంలో సోమవారం జిల్లాధికారి కే నితీశ్ రాయచూరు తాలూకాలోని మటమారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. మృతి చెందిన మహిళ వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 10వ తేదీన పురిటినొప్పులతో వచ్చిన మహిళకు తమ ఆస్పత్రిలోనే సాధారణ కాన్పు నిర్వహించామన్నారు. 12వ తేదీ వరకు తల్లీబిడ్డలిద్దరు క్షేమంగా ఉన్న నేపథ్యంలో వారిని ఆరోజు సాయంత్రం డిశ్చార్జ్ చేయగా 14వ తేదీ వరకు ఇంట్లో బాగా ఉన్నార్నారు. ఆకస్మికంగా ఆమె అస్వస్థతకు గురికాగా తిరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తెచ్చారని తాము ప్రాథమిక చికిత్సను అందించి అక్కడి నుంచి అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు జిల్లాధికారికి వైద్యులు వివరించారు. కాగా ఈ సందర్భంగా జిల్లాధికారిని కలిసిన గ్రామస్థులు తమ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉందని ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లాధికారి ఆస్పత్రిని త్వరలోనే అప్‌గ్రేడ్ చేయనున్నామని వైద్యుల సంఖ్యతో పాటు సిబ్బంది సంఖ్యను కూడా పెంచనున్నట్లు గ్రామస్థులకు తెలిపారు.

అంతర్రాష్ట్ర బైక్‌ల దొంగ అరెస్ట్

▸▸ 4 ద్విచక్రవాహనాల స్వాధీనం


అనంతపురం క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం టూ టౌన్ పోలీసులు అంతర్రాష్ట్ర బైక్‌ల దొంగను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సోమవారం టూటౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐలు రుష్యేంద్ర బాబు, గౌస్‌పీర్‌లు సిబ్బందితో కలిసి విద్యుత్ నగర్ సర్కిల్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా చెళ్ళకెరెకు చెందిన వన రస జితేంద్ర అలియాస్ మరాఠీ జితేంద్ర పట్టుబడ్డాడు. బైక్‌పై వెళ్తూ నిలపకుండా వెళ్లిపోతుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. ప్రస్తుతం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని కేవీ ఎస్ నగర్‌లో నివాసముంటున్న అతను పలు బైక్‌ల చోరీల్లో పాల్గొన్నట్లు తేలింది. నగరంలోని ఎస్వీ థియేటర్ సమీపంలో హోండా షైన్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో స్ప్లెండర్ ప్లస్, ప్రభుత్వాసుపత్రి ఆవరణలో హోండా యాక్టివా, ప్రకాష్ రోడ్డులోని పోలీస్‌క్వార్టర్స్‌లో హోండా యాక్టివాను చోరీ చేసినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. బైక్‌లను ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని కంపచెట్లలో దాచి ఉంచగా పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

కాంతరాజ్ కమిటీ


సిఫారసులు అమలు చేయాలి

▸▸ బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శాంతప్ప

రాయచూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధి, అభ్యున్నతికి సంబంధించి కాంతరాజ్ కమిటీ ఇచ్చిన నివేదికను వెంటనే అమలు చేయాలని బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శాంతప్ప కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ పంచమశాలి కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌ను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బీసీ జాబితాలో చేర్చాలని కోరే హక్కు ప్రతి కులానికి ఉంటుందని అయితే బీసీల జాబితాలో చేర్చేందుకు కొన్ని నియమ నిబంధనలుంటాయని వాటిని ప్రతి ఒక్కరు గౌరవించాల్సిందేనన్నారు. ఈ విషయంలో బీసీ కమిషన్ పంచమశాలి కులాల అభ్యర్థనను పరిగణించరాదని, ఆ కులాన్ని బీసీలో చేర్చడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కాగా ఇదే విషయాన్ని ఈ నెల 18న బెళగావిలో జరుగుతున్న శాసనసభ సమావేశాలలో ముఖ్యమంత్రిని కలిసి లిఖిత పూర్వకంగా విన్నవిస్తామన్నారు.



మీడియాతో శాంతప్ప తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.10	1,590.67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,941	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,154	1,903
నీటి నిల్వ (టీఎంసీలు)	90.72	11.60

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

● భర్త మృతి.. భార్య, పిల్లలకు గాయాలు



భార్య, కుమారుడితో తాయప్ప (ఫైల్)

బళ్లారి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో యజమాని మృతిచెందారు. మరియమ్మనహళ్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హొస్పేట్ సమీపంలోని దానాయకన క్రాస్ వద్ద సోమవారం కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తాయప్ప (40) మృతిచెందారు. భార్య రాధ, పిల్లలు దివ్య, ధృవలకు తీవ్ర గాయాలయ్యాయి. హొస్పేట్ నుంచి కూడ్లిగి వైపు కారు వెళ్తోంది. కూడ్లిగి నుంచి హొస్పేట్ వైపు ద్విచక్రవాహనంలో మానకేరికి చెందిన తాయప్ప, ఆయన భార్య, ఇద్దరు పిల్లలతో వస్తున్నారు. ఇద్దరూ చిన్నపిల్లలు కావడంతో ద్విచక్రవాహనం ముందు ఒకరిని కూర్చొబెట్టుకోగా తల్లితండ్రి మధ్యలో మరొక్కరిని కూర్చొబెట్టుకుని ప్రయాణిస్తున్నారు. మానకెర క్రాస్ వద్ద మలుపు తిరుగుతున్న బైకును వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. కింద పడిన తాయప్ప(40) తలకు బలంగా గాయాలు కావడంతో అక్కకడికక్కడే కన్నుమూశారు. తీవ్ర గాయాలైన భార్య, ఇద్దరు పిల్లలను బళ్లారి ట్రామాకేర్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసునమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

బూడిద దిబ్బను దున్నేశారు..

బళ్లారి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆదియుగంలో గోవులు, నందిని పూజించే సంస్కృతి ఉంది. అప్పుడు వ్యవసాయం, పశుపోషణ అధికంగా ఉన్న ఆకాలంలో పశువుల పేడ ఒక చోట వేసి దాన్ని కాలానుగుణంగా కాల్చేవారు. దీని వల్ల గ్రామాలకు పట్టిన దోషం పోతుందని అలాగే పంటపొలాలు, పాడి పుష్కలంగా ఉంటాయనేది వారి నమ్మకం. అలా దాదాపు 500 సంవత్సరాల క్రితం ఏర్పడిన బూడిద దిబ్బ బళ్లారి రూరల్ పరిదిలోని మోకా హళాల్బీ సిరివర గ్రామ పంచాయితీ పరిదిలో ఉంది. సాధారణంగా దీనిని ఎవ్వరూ పాడు చేయరు. అయితే ఆ పొలం రైతు ఆదివారం దున్నేశారు. తన పట్టా పొలంలో ఉండే దిబ్బను రైతు దున్నుకుని పంట సాగుకు సిద్ధమయ్యారు. ఇది చారిత్రాత్మకంగా ఎంతో పేరు పొందింది. ఈ బూడిద దిబ్బలు కర్ణాటక- ఆంధ్ర సరిహద్దులో ఉండే ప్రాంతాల్లో అనేకం ఉన్నాయి. సంగనకల్లుతో పాటు కుడితిని వద్ద కూడా ఇలాంటి బూడిద దిబ్బలు చరిత్రకు సాక్ష్యాలుగా చెపుతారు. 2012లో వీటిని ప్రభుత్వ రక్షణ స్థలాలుగా ప్రకటించారు. వీటి పక్కన దరిదాపు 100 మీటర్ల దూరం వరకూ ఎటువంటి పనులు చేయరాదని ప్రభుత్వం ప్రకటించింది. బూడిదదిబ్బను దున్నుతున్నారని తెలియడంతో బళ్లారి రాబర్ట్ బ్రూస్‌ఫుట్ సంగనకల్లు ప్రీహిస్టారిక్ మ్యూజియం సభ్యులు స్పదించారు. పురావస్తు, మ్యూజియం, వాసత్వశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు పొలాన్ని పరిశీలించారు. రైతు దిబ్బ ప్రాముఖ్యత తెలియక దున్నుకున్నారని ప్రాథమిక విచారణలో తేలింది. విషయం పై ఏడీసీ జుబేదాను విచారించగా బుడిద గుట్టల వద్దను వెళ్లి విచారించామని, అది దాదాపు 500 సంత్సరం కాలం నాటిదన్నారు. దీనికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేశామన్నారు.

పట్టాలివ్వాలని సండూరు రైతుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో రైతులు

బళ్లారి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సండూరు ప్రాంతంలోని అటవీప్రాంతంలో 70 ఏళ్లకు పైగా రైతులు పొలాలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఆ భూములకు పట్టాలివ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం సాగు రైతులతో కర్ణాటక ప్రాంత రైతు సంఘం (కేపీఆర్ఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్నా పట్టాలు లేకపోవడంతో ఎలాంటి సదుపాయాలు పొందలేకపోతున్నామన్నారు. పలు సార్లు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వారు కోరారు. పట్టాలతోనే తమకు హక్కులు సాధ్యమన్నారు. నిరసనలో రైతు సంఘం నాయకుడు శివశంకర్, బసవరాజు, ఖలందర్ బాషా, స్వామి పాల్గొన్నారు.

మహిళల రక్షణకు మరిన్ని చట్టాలు అవసరం

● ప్రొఫెసర్ బరగూరు రామచంద్రప్ప



బళ్లారి సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సామాజిక-ఆర్థిక నిర్మాణంలో అట్టడుగున ఉన్న మహిళల రక్షణకు మరిన్ని చట్టాలు అవసరమని ప్రొఫెసర్ బరగూరు రామచంద్రప్ప అన్నారు. సోమవారం నగరంలో మహిళల గౌరవం కోసం ఏఐఎంఎంఎస్ ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళా సదస్సు ప్రారంభోత్సవానికి పురుషుడిని ఆహ్వానిస్తే పురుషుల్లో స్త్రీ పక్షపాత ధోరణి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందనడానికి ఇది ప్రతీక అన్నారు. సామాజిక -ఆర్థిక నిర్మాణంలో అట్టడుగున ఉన్న స్త్రీలు, మహిళల అభివృద్దే దేశాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న ఆఘాయిత్యాలను నిరోధించే చట్టాల కంటే జంతువులు,పక్షుల రక్షణకే ఎక్కువ చట్టాలు ఉన్నాయన్నారు. అన్ని జీవరాసులకూ చట్టం అవసరమని, మహిళలపై నేరాలను నిరోధించేందుకు కఠిన చట్టం ఎందుకు లేదన్నారు. ప్రభుత్వం ఆడపిల్లలకు ఆరోగ్యాన్ని అందజేస్తే దానిని మానవతా చర్యగా పేర్కొనవచ్చన్నారు. మన అంతిమ లక్ష్యం సామాజిక, ఆర్థిక మార్పుకోసం మనం కృషి చేయాలన్నారు. ఏఐఎంఎంఎస్ పదాధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం

బళ్లారి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు, బళ్లారి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ జన్మదినం సదర్భంగా ఆయన సోదరులు, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం బళ్లారి విమ్స్ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. బళ్లారి జిల్లా కాంగ్రెస్ సమితి ప్రధాన కార్యదర్శి కే. హెచ్ విల్సన్, ఐఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు కే. తాయప్ప, హనుమంత, శాంతి, నాని, వంశీ, ఫరూక్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా విజయ్ దివస్

బళ్లారిరూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాజీ సైనికులు విజయ్ దివస్ కార్యక్రమాన్ని సర్కారీ మెట్రిక్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అయ్యన్న గౌడ్ పాటిల్ 1971 యుద్ధ సమయంలో సైనికుల వీరగాథలు తెలియజేశారు. సరిహద్దులో వారి పోరాటంతోనే దేశవ్యాప్తంగా ప్రజలు సుఖంగా జీవిస్తున్నారన్నారు. అనంతరం మాజీ సైనికుల ఆధ్వర్యంలో పలు అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధు సైనిక అమృత్ కోరి ఎంఎస్ రావు, లలిత, బీఎస్ ప్రహ్లాద రెడ్డి, ఈశ్వరరెడ్డి, లక్ష్మణ్ గోవింద్, వీరేష్, రాజశేఖర్, వన్నూరప్ప, ఎమ్మారెడ్డి, ప్రవీణ్ కుమార్, రవీంద్రప్ప, రామానాయుడు, హనుమంతప్ప, తదితరులు పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న మాజీ సైనికులు

సువర్ణసౌధ ముందు విలేకరుల నిరసన



నిరసనలో బళ్లారి జిల్లా రాజ్యాధ్యక్షుడు మల్లికార్జున తదితరులు

బళ్లారిరూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో పని చేస్తున్న విలేకరులకు అక్రిడిటేషన్ ఇచ్చి, బస్సుపాస్ ఇవ్వాలని కేడబ్ల్యూజేవీ రాష్ట్ర అధ్యక్షుడు బంగ్లి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం బెళగావి సువర్ణసౌధ వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం సిద్దరామయ్యకు పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. ధర్నాకు జిల్లా నుంచి విలేకరులు భారీగా తరలివెళ్లారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

సిరుగుప్ప, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని పురసభ అధ్యక్షురాలు రేణుకమ్మ సూచించారు. సోమవారం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య శాఖ నగరసభ శిశు అభివృద్ధి యోజన ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ మొక్కలకు నీరు పోసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి నాగ ప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా అండర్‌పాస్ పనులు

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): నగరంలోని దుర్గమ్మ గుడి అండర్ పాస్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గత నెల రోడ్డు అభివృద్ధి పనుల కారణంగా నగరం వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఇతర మార్గాలకు మళ్లించారు. నగరాన్ని రెండు భాగాలుగా విభజించే రైల్వే ట్రాక్ క్రింద దుర్గమ్మగుడి, సత్యనారాయణ పేట వద్ద నిర్మించిన అండర్ పాస్‌లు ప్రధాన మార్గాలు కావడంతో వీటిలో ఏ ఒక్కటిలో అంతరాయం ఏర్పడినా వాహనదారులకు ఇబ్బంది తప్పదు. ప్రస్తుతం ఈ మార్గంలో వెట్‌మిక్స్ పనులు పూర్తికాగా... మరో రెండు మూడు రోజుల్లో ఈ మార్గంలో తారు రోడ్డు పనులు పూర్తి కావాల్సి ఉంది. త్వరగా పూర్తి చేసి ప్రయాణానికి అనుమతివ్వాలని నగరవాసులు కోరుతున్నారు.



పూర్తయిన కాంక్రీట్ పనులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టస్కర్లు

జీతాల కోసం లస్కర్ల ఆందోళన

బళ్లారి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి నీరావరి నిగమ మండలి పరిదిలో పని చేస్తున్న లస్కర్లు జీతాల కోసం ఆందోళన చేపట్టారు. బళ్లారి డివిజన్ పరిదిలో ఉన్న తుంగభద్ర కాలువలకు లస్కర్లగా పనిచేస్తున్న గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని సుమారు 190 మంది సోమవారం బళ్లారి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నా తమను పర్మినెంట్ చేయలేదన్నారు. నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇప్పటికైనా జీతాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో నీరావతి నిగమండలి అధికారి కి వినత పత్రం అందజేశారు. దీనిపై అధికారి మాట్లాడుతూ శాఖా పరంగా జీతాలు ఇచ్చేశామని సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడుకోవాలన్నారు. అనంతరం లస్కర్లు ఆందోళన విరమించారు.

నారుమళ్లను పరిశీలించిన అధికారులు



నారుమళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కంప్లి, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల రైతులు వేసుకున్న నారుమళ్లకు ఉల్లికోడు తెగులు సోకడంపై అధికారులు స్పందించారు. కంప్లి, కురుగోడు, సిరిగేరి తదితర ప్రాంతాల్లో సోమవారం దడేసూగూరు కృషి విజ్ఞాన కేంద్రం ముఖ్యులు చంద్రనాయక్ నారు మళ్లను పరిశీలించారు. కరూరు గ్రామానికి చెందిన మల్లికార్జున, రాఘవేంద్ర రెడ్డి, వీరభద్రప్ప నాయక్‌లకు చెందిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని నారుమళ్లు వేసుకుంటే ఎలాంటి సమస్యలు రావన్నారు. చలి, మంచుతో పాటు నారుమళ్లలో అధిక నీరు చేరిన కారణంగా తెగుళ్లు సోకుతున్నాయన్నారు. రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలను పాటించాలన్నారు.

అంతర్ జిల్లా హాకీ టోర్నీలో ధారవాడ విజయం



ఫైనల్లో తలపడుతున్న క్రీడాకారులు

బళ్లారి సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల సబ్ జూనియర్ ఫైనల్లో ధారవాడ విజయం సాధించిది. బళ్లారి, ధారవాడ జట్ల మధ్య ఫైనల్ పోటీలు ఆదివారం జరిగాయి. రెండు జట్లు మూడు గోల్స్ చేసి సమానంగ ఉన్నాయి.పెనాల్టీ షూటౌట్‌లో బళ్లారి నాలుగు గోల్స్ చేయగా. ధారవాడ ఐదు గోల్స్ చేసి విజయం సాధించింది. ఈటోర్నీలో ఉత్తర కర్ణాటక 8 జిల్లాల బృందాలు పాల్గొన్నాయి. ఇక్కడ విజయం సాధించిన బృందం బెంగళూరులో పాల్గొననున్నారు.

రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ



బ్రెడ్డు పంపిణీ చేస్తున్న జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ

బళ్లారి సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ నాయకులు, కేంద్ర మంత్రి హెచ్ డీ కుమారస్వామి 65వ జన్మదినం సందర్భంగా సోమవారం నగరంలోని జిల్లా ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు, స్వీట్లు పంపిణీ చేశారు. జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్ళి తాయన్న ఆధ్వర్యంలోపార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి కుమారస్వామి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంలో తాయణ్ణ మాట్లాడుతూ కుమారస్వామి నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని కోరారు. పార్టీ తాలూకా అధ్యక్షుడు అశోక్, బళ్లారి నగర అధ్యక్షుడు వంద్రి, నాగరాజ్, ముత్తురాజ్, ప్రదీప్, రామాంజనేయులు,అద్దగేరి రామణ్ణ, బళ్లారి మహిళా అధ్యక్షురాలు జమీల, భవాని, రేణుక, నీలా, షబానా, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తోలుబొమ్మలాటతో అపార విజ్ఞానం



తోలు బొమ్మలను ప్రదర్శిస్తున్న కళాకారులు

బళ్లారి సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తోలు బొమ్మలాటకు సమాజాన్ని విజ్ఞానం వైపు నడిపించే శక్తి ఉందని నీలకంఠేశ్వర ఆలయ ట్రస్టు కోశాధికారి రత్నాకర్ తెలిపారు. ఆదివారం రాత్రి డి.హిరేహాల్ నీలకంఠేశ్వర ఆలయ జాతరలో హాలికుంటేరాయ తోలుబొమ్మల కళాబృందం, బళ్లారి ఎర్రిస్వామి తోలు బొమ్మల కళా మేళా ట్రస్టు బళ్లారి సహకారంతో ఆలయ ప్రాంగణంలో సుగ్గి సంభ్రమ సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శించారు. కార్రక్రమాన్ని ప్రారంభించిన రత్నాకర్ మాట్లాడుతూ పిల్లల్లో ధైర్యాన్ని పెంపొందించే శక్తి కళకు ఉందన్నారు. తోలు బొమ్మల కళామేళా ట్రస్ట్ అధ్యక్షుడు హొన్నూర్‌స్వామి మాట్లాడుతూ గ్రామాల్లో తోలుబొమ్మలాట, బయలాట కార్యక్రమాలకు నేటికీ ఆదరణ తగ్గలేదన్నారు. అనంతరం ప్రదర్శించిన దశకంఠరావణ తోలుబొమ్మలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రహ్లాద, కార్యదర్శి బసవరాజు, ఆనంద, గంజి సురేశ్, తిప్పేస్వామి, సంతోష్ కుమార్, కార్తీక, శరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



కొలతలు తీసుకుంటున్న అధికారులు

కంప్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ నడిబొడ్డున ఉన్న ఎదురు మసీదు నుంచి జోగి కాలువ వరకు రోడ్డు పనుల విస్తరణపై కంప్లి పురసభ ముఖ్య అధికారి దుర్గన్న సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎదురు మసీదు వరకు రోడ్డు పనులు చేపట్టామన్నారు. అక్కడి నుంచి జోగి కాలువ వరకు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలో అధికారుల ఆదేశాలమేరకు ప్రముఖులు, కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేసి అనంతరం పనులు ప్రారంభిస్తామన్నారు. వారితోపాటు జేఈ మేఘన, సిబ్బంది చిదానందప్ప, మల్లేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఫ్లైఓవర్ పనులు

హొస్పేట, కంప్లి రోడ్డులో రైల్వే ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరమ్మతులతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ఫ్లై ఓవర్ పనులను రెండు సంవత్సరాల క్రితం మంత్రి ఆనంద్ సింగ్ ప్రారంభించారు. పనులు పూర్తి కాకపోవడంతో దాదాపు 20 కిలో మీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నత్తనడకన సాగుతున్న పనులు



హొసూరు జోన్

ఏనుగు సంచారంతో భయం.. భయం..

ఒంటరిగా తిరుగుతున్న ఏనుగు



హొసూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): హొసూరు సమీపంలోని ఒంటరి ఏనుగు సంచారంతో రైతులు, ప్రజల్లో భయాందోనలకు కారణమవుతోంది. సానమావు, ఊడేదుర్గం వంటి అడవుల్లో 100కు పైగా ఏనుగులు ఉన్నాయి. వీటినుంచి విడిపోయిన ఏనుగులు ఒంటరిగా సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. ఒక రైతుపై దాడి చేసిన ఘటనలో కాలు విరిగి హొసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి విదితమే. కర్ణాటక అడవులనుంచి వచ్చిన 100 ఏనుగులు నెలరోజులుగా కృష్ణగిరి జిల్లాలో సంచరిస్తున్నాయి. హొసూరు సానమావు అటవీ ప్రాంతంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలైన సానమావు, బీర్జేపల్లి, తేన్‌దుర్గం, కుమ్మేపల్లి, అనుమంతపురం, సినిగిరిపల్లి, బోడిసిపల్లి, అటవీ ప్రాంతాలలో ప్రస్తుతం 20కు పైగా ఏనుగులు ఉన్నట్టు తెలుస్తోంది. ఏనుగుల సంచారంతో అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు పలు హెచ్చరికలు చేశారు. అటవీప్రాంతాలకు అనుబంధంగా ఉండే పంటపొలాలవైపు వెళ్లరాదని, అడవుల్లో పశువుల మేతకు వెళ్లరాదని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హొసూరు(కృష్ణగిరి), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్దనపల్లి సబ్‌స్టేషన్‌లో అత్యవసర నిర్వహణ పనుల రీత్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్‌కోత ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. అగరం, ద్యానదుర్గం, నాగమంగళం, నలరాపల్లి, బీర్జేపల్లి, అనుగురుకై, బొడిసిపల్లి, ఇరుదాళం, వరగనపల్లి, టి.కొత్తపల్లి, కెలమంగళం, అఋసొన్తై, కదూరు, బొమ్మడతుదానూరు, చిన్నట్టి, కనుంజూర్, భైరమంగలం, జక్కేరి, పచ్చపనట్టి, బేవనతం, పన్నంటి, అలనట్టి, కురుబరపల్లి, దేవకనపల్లి, సామనపల్లి, చిన్నపెద్దగానపల్లి, కీరనపల్లి, బాళేగులి, సానమావు సహా చుట్టుపక్కల గ్రామాలలో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ప్రత్యంగిరాదేవి ఆలయంలో హోమం




హోమంలో పాల్గొన్న భక్తులు

హొసూరు(కృష్ణగిరి), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హొసూరు మొర్నపల్లి ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన రాహుకేతు, మహా ప్రత్యంగిరాదేవి ఆలయంలో ఆదివారం సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. సాధారణంగా పౌర్ణమి, అమావాస్య రోజులలో విశేషహోమాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. హోమంలో ఎండుమిర్చి సమర్పించడం ఇక్కడి ప్రత్యేకత. అమ్మవారికి ఇలా పూజలు చేయడం ద్వారా దుష్టశక్తుల ప్రభావం పోతుందని భక్తుల నమ్మకంగా ఉంటోంది. వివాహంలో అడ్డంకులు తొలగాలని, ఇతరత్రా సమస్యల నివారణకు మొక్కులు తీర్చుకుంటుంటారు. విశేషహోమంలో స్థానికులు, కర్ణాటకకు చెందిన భక్తులతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే

హొసూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హొసూరు బ్లాక్ పరిధిలోని మడివాళం గ్రామం పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో రూ.94 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆరు తరగతి గదులను హొసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ ప్రారంభించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లీషు మీడియం విద్యను అందిస్తున్న ఈ పాఠశాలలో 300 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం అదనపు తరగతి గదులు నిర్మించారు. ఎంతోకాలంగా డిమాండ్ ఉన్న సమస్య పరిష్కారం కావడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీడీఓ బాలాజీతోపాటు పలువురు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో పాఠశాల సిబ్బంది

వర్షాలతో పంటలకు నష్టం

● ఆదుకోవాలని రైతుల వినతి

హొసూరు(కృష్ణగిరి), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): హొసూరు ప్రాంతంలో కూరగాయలు, పూలతోపాటు రాగులు కూడా ఎక్కువగా పండిస్తున్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చేతికి వచ్చిన రాగిపంటకు మళ్లీ మొలక వస్తోందని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది తరహాలోనే రాగి దిగుబడిలో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంటుందని భావించారు. అంచెట్టి, హొసూరు, డెంకణీకోట తాలూకాలలో వర్షాధారిత రాగి పంటను సాగు చేస్తున్నారు. గతంలో కంటే తృణధాన్యాలపై ఆసక్తి పెరగడంతో రాగికి డిమాండ్ ఏర్పడింది. హొసూరు పరిధిల్లోని బాగలూరు, బెళత్తూరు, తట్టిగానపల్లి, మాసినాయకనపల్లి, తాలూకా పరిధిల్లోని కెలమంగలం, తళి, బెట్టముగిలాళం తదితర ప్రాంతాల్లో తుపాను కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కోతదశలో ఉన్న పలు రకాల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతున్నారు.



మొలకలు వచ్చిన రాగిపంట